# పనులు త్వరగా పూర్తి చేయాలి

- గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి
- 300 పడకల దవాఖాన, ఇంటిగ్రేటెడ్ మార్కెట్ పనులు పరిశీలన



ఇంటిగ్రేటెడ్ మార్కెట్ పనులు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే బండ్ల

గద్వాల, జనవరి 11 : జిల్లాకేంద్రంలో నిర్మిస్తున్న 300 పడకల దవాఖాన, ఇంటిగ్రేటెడ్ మార్కెట్ పనులు వేగవంతంగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి కాంట్రాక్టర్లు, అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టర్ సంతోష్‌తో కలిసి దవాఖాన, మార్కెట్ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ దవాఖానలో మౌలిక సదుపాయాలు, విద్యుత్ తదితర పనులు త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. పనుల పూర్తికి సీఎం రేవంత్‌రెడ్డి, వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ సహకరిస్తామని హామీ ఇచ్చారని తెలిపారు. మార్కెట్‌లో వ్యాపారులకు అవసరమైన సదుపాయాలు కల్పించి త్వరలో దుకాణాలు అందజేస్తామన్నారు. కూరగాయలు, నాన్‌వెజ్ దుకాణాలు, తదితర వాటిని ఏర్పాటు చేసుకునేందుకు ఆధునిక హంగులతో నిర్మిస్తున్నట్లు చెప్పారు. గత అరవైఏండ్ల కాంగ్రెస్ పాలనలో గద్వాల నియోజకవర్గంలో విద్య, వైద్య సౌకర్యాలు వెనుకబడ్డాయని, దీంతో ప్రజలకు సరైన వైద్య సేవలు అందక నానా అవస్థలు పడ్డారని ఎమ్మెల్యే బండ్ల అన్నారు. తెలంగాణ ఏర్పడిన తర్వాత కేసీఆర్ సర్కారు నడిగడ్డపై ప్రత్యేక శ్రద్ధ వహించి విద్య, వైద్య రంగాలపై ప్రత్యేక దృష్టి పెట్టిందన్నారు. వారి వెంట అదనపు కలెక్టర్ అపూర్వచౌహాన్, మున్సిపల్ చైర్మన్ కేశవ్, వైస్ చైర్మన్ బాబర్, ఆర్డీవో చంద్రకళ, వైద్యాధికారులు కిశోర్‌కుమార్, శశికళ, మున్సిపల్ కమిషనర్ నర్సింహ, సర్పంచ్ వాసు, ఎంపీపీ విజయ్‌కుమార్, నాయకుడు రామన్‌గౌడ్ ఉన్నారు.

# పాల ట్యాంకర్ ఢీ : ఇద్దరు మృతి

- మృతుల కుటుంబాలను పరామర్శించిన ఎమ్మెల్యే విజయుడు

ఉండవెల్లి, జనవరి 11 : పాల ట్యాంకర్ ఢీకొని ఇద్దరు మృతి చెందగా మరో ఇద్దరు గాయపడిన ఘటన అలంపూర్ చౌరస్తా సమీపంలోని 44వ జాతీయ రహదారిపై గురువారం చోటు చేసుకున్నది. స్థానికులు, వాహనదారులు తెలిపిన వివరాల ప్రకారం ఉండవెల్లి మండలం అలంపూర్ చౌరస్తా ఉత్తర ఫుడ్స్ దగ్గర హైవే సిబ్బంది రమేశ్(వాహన డ్రైవర్), సీతారాముడు, లక్ష్మీదేవమ్మ, సుధాకర్, సతీశ్, ఆనంద్‌బాబు డివైడర్‌పై ఉన్న గడ్డిని తొలగిస్తున్నారు. మధ్యాహ్న భోజనం అనంతరం రమేశ్, సీతారాముడు, సుధాకర్, లక్ష్మీదేవమ్మ స్లో మూవింగ్ వాహనం నిలిపి హైవే రోడ్డుపై సూచిక బోర్డులు ఏర్పాటు చేస్తుండగా హైదరాబాద్ నుంచి కర్నూలు వెళ్తున్న పాల ట్యాంకర్ వేగంగా వచ్చి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో నలుగురికి తీవ్ర గాయాలు కాగా వారిని హుటాహుటిన కర్నూల్ ప్రభుత్వ దవాఖానకు తరలించగా చికిత్స పొందుతూ రమేశ్(ఉండవెల్లి), సీతారాముడు(పుల్లూరు) మృతి చెందారు. లక్ష్మీదేవమ్మ, సుధాకర్‌కు రక్తగాయాలు కావడంతో వైద్య సిబ్బంది చికిత్స నిర్వహిస్తున్నారు. మృతులు రోజువారి కూలీలు కావడంతో బాధిత కుటుంబాలకు న్యాయం చేయాలని ప్రజాసంఘాల నాయకులు కోరుతున్నారు. ఈ విషయం తెలుసుకున్న అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు కర్నూలు దవాఖానకు వెళ్లి బాధిత కుటుంబాలను పరామర్శించారు. హైవే అధికారులతో మాట్లాడి బాధిత కుటుంబాలకు న్యాయం జరిగేలా చూస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.













































- పరిస్థితి ఇలాగే కొనసాగితే కష్టమే..
- వనపర్తి జిల్లాలో భారీగా తగ్గుదల
- రాబోయే రోజుల్లో గడ్డుకాలమే..



వనపర్తి జిల్లాలో నీళ్లు లేక వరిమడిని మధ్యలోనే వదిలేసిన రైతు

# భూగర్భ జలం మరింత జఠిలం

- తగ్గిపోతున్న గ్రౌండ్ వాటర్
- జలాశయాల్లో తగ్గిన నీటినిల్వలు
- ప్రాజెక్టుల ఆయకట్టుకు క్రాప్ హాలిడే
- వర్షాభావ పరిస్థితులే కారణం
- ఎత్తిపోతలకు నిలిచిన పంపింగ్
- కాల్వలు పారక బోరునీరే ఆధారం




వనపర్తి, జనవరి 11 (నమస్తే తెలంగాణ) : వర్షాల ప్రభావం.. ప్రాజెక్టుల నుంచి నీటి సరఫరా బంద్ చేయడంతో జిల్లాలో భూగర్భజలాలు తగ్గుముఖం పడుతున్నాయి. గత మూడేండ్లపాటు వరుసగా భూగర్భజలాలు సమృద్ధిగా ఉండడంతో రైతులు పుష్కలంగా పంటలు పండించారు. కాల్వల్లో నీళ్లు కూడా రెండు పంటలకు వానకాలం, యాసంగిల్లో తొణికిసలాడటంతో భూగర్భజలాల సమస్య తలెత్తలేదు. ప్రస్తుత ఏడాదిలో వర్షాభావ పరిస్థితులు భూగర్భజలాలపై తీవ్ర ప్రభావం చూపెడుతున్నాయి. యాసంగిలో నాట్లు వేసుకుందామని సిద్ధం చేసుకున్న నారుమళ్లను సైతం భయంతో కొందరు వదిలేసుకుంటే, మరికొందరు ఇతరులకు అమ్ముకుంటున్నారు. ఏటా వరుసగా పంటలు పండించుకుంటూ వస్తున్న రైతాంగానికి ఈ ఏడాది యాసంగిలో భూగర్భజలాల సమస్య ఇప్పుడే మొదలుకావడంతో అన్నదాతలు ఆందోళనకు గురవుతున్నారు.

***నాలుగు మండలాల్లో తగ్గిన వర్షపాతం..***

జిల్లాలో వర్షపాతం నమోదులు ఆందోళన కల్గించేలా ఉన్నాయి. జిల్లాలోని 14 మండలాల్లోను ఆశాజనకమైన వర్షాలు లేవు. చిన్నంబావి, వీపనగండ్ల, ఆత్మకూరు, పాన్‌గల్ మండలాల్లో లోటు వర్షపాతం నమోదైంది. మిగిలిన 10మండలాల్లో సాధారణ వర్షపాతం నమోదైంది. ఇలా సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదు కావడంతో భూగర్భజలాలు తగ్గుముఖం పడుతున్నాయి. రెండో పంటకు కాల్వ నీళ్లు వస్తాయనుకొని ఆశలు పెట్టుకున్న రైతాంగానికి పూర్తిగా బ్రేక్‌లు పడ్డాయి. క్రాప్ హాలీడే ఇచ్చినట్లుగానే సాగునీటి అధికారులు తేల్చేశారు. వానకాలం చేతికి వచ్చిన పంటలతో హుషారుగా ఉన్న రైతాంగానికి యాసంగిలో కాల్వల నీళ్లు రాకపోవడం నిరాశకు లోను చేసింది. గడిచిన నాలుగేండ్లలో తీవ్ర ఎండాకాలంలోనూ ఇలాంటి పరిస్థితులు ఎదురు కాలేదని రైతులు గుర్తు చేసుకుంటున్నారు. వరుసగా ఏడాదికి రెండు, మూడు పంటలు పండించిన అన్నదాతలు ఈ సారి ఒకే పంటకు పరిమితం కావాల్సి వస్తుంది. చెరువుల నీటి ఆధారం ఉన్న రైతులు మాత్రమే యాసంగిలో వరి వేసుకొనే అవకాశం ఉన్నది.

***ఆటోమెటిక్ మెషిన్‌లతో లెక్క..***

జిల్లాలో భూగర్భజల శాఖ పరిధిలో 30 ఆటోమెటిక్ ఫిజో మీటర్ కేంద్రాలున్నాయి. ఈ కేంద్రాల ద్వారానే భూగర్భ జలనీటి మట్టాలను లెక్కిస్తారు. ప్రతి ఆరు గంటలకు ఒకసారి ఈ కేంద్రాల ద్వారా హైదరాబాద్‌లోని సర్వర్స్‌కు ఆటోమెటిక్‌గా సమాచారం వెళ్తుంది. ఈ లెక్కను మూడు విధాలుగా పరిశీలన చేసి పరిగణలోకి తీసుకుంటారు. జిల్లాలో 2016నుంచి నీటిమట్టాల పరిస్థితి ఆశాజనకంగా కొనసాగుతూ వచ్చింది. ఈ ఏడాది జూన్ నెల నుంచి డిసెంబర్ వరకు సాధారణ వర్షపాతం 582.0 మిల్లి మీటర్లుంటే, 535.0 మిల్లిమీటర్ల వర్షపాతంగా నమోదైంది. ఈమేరకు జిల్లాలో సాధారణ వర్షపాతం 8శాతం తక్కువగా నమోదైంది. వర్షాల సీజన్ బాగుంటే జూన్ నెల నుంచి నవంబర్ వరకు భూగర్భజలాల రీచార్జ్ సమృద్ధిగా ఉంటుంది. అయితే లోటు వర్షపాతం నమోదైన నాలుగు మండలాల్లో 20 నుంచి 59 శాతం లోటుగా ఉన్నట్లు తేలింది.

**వనపర్తి జిల్లాలో గత, ప్రస్తుత డిసెంబర్‌లో భూగర్భ జలాల వివరాలు..**

| ఫిజియోమీటర్ స్టేషన్ | 2022 | 2023 | నీటిమట్టం వ్యత్యాసం |
|---|---|---|---|
| ఆత్మకూరు | 5.60 మీటర్లు | 5.80 మీటర్లు | -0.2 |
| అమరచింత | 2.90 మీటర్లు | 7.00 మీటర్లు | -4.10 |
| ఖిల్లాఘణపురం | 2.50 మీటర్లు | 5.80 మీటర్లు | -3.3 |
| సంగినేనిపల్లి (వీపనగండ్ల) | 1.95 మీటర్లు | 4.50 మీటర్లు | -2.55 |
| గోపాల్‌పేట | 1.65 మీటర్లు | 3.40 మీటర్లు | -1.75 |
| బెక్కెం (చిన్నంబావి) | 3.05 మీటర్లు | 5.50 మీటర్లు | -2.45 |
| కానాయిపల్లి (కొత్తకోట) | 8.40 మీటర్లు | 12.85 మీటర్లు | -4.45 |
| ద్వారకానగర్ (మదనాపురం) | 3.00 మీటర్లు | 11.60 మీటర్లు | -8.6 |
| పాన్‌గల్ | 4.10 మీటర్లు | 8.40 మీటర్లు | -4.3 |
| పెబ్బేరు | 9.40 మీటర్లు | 9.20 మీటర్లు | +0.2 |
| పెద్దమందడి | 1.75 మీటర్లు | 2.55 మీటర్లు | -0.8 |
| రేవల్లి | 10.00 మీటర్లు | 2.80 మీటర్లు | +7.2 |
| పెద్దగూడెం (వనపర్తి) | 1.86 మీటర్లు | 3.75 మీటర్లు | -1.89 |
| శ్రీరంగాపురం | 4.35 మీటర్లు | 4.30 మీటర్లు | +0.05 |
| **జిల్లా సరాసరి** | **4.36 మీటర్లు** | **4.75 మీటర్లు** | **-0.59** |

### నారు పోసి అమ్ముకున్న..



యాసంగిలో నాటు వేసుకుందామని రెండు ప్యాకెట్లు వరినారు పోసుకున్నా.. మా పొలాల వైపు భీమా హైలెవల్ కెనాల్ ఉంది. కానీ వానకాలమే నీళ్లు రావు. యాసంగిలో కాల్వలకు నీళ్లు రావని అధికారులు చెప్పారు. ఇప్పటికే ఉన్న బోర్లు కూడా నీళ్లు తగ్గుతున్నాయి. మాకు 5 ఎకరాల్లో మామిడితోట ఉంది. దానికి నీళ్ల ఎద్దడి వస్తే కష్టమని పోసిన వరి నారును అమ్ముకున్నా.. కనీసం మా చెట్ల వరకైనా నీళ్లు సరిపోతే బాగుండు. బోర్లమీదనే ఆధారం. ఈ ఏడాది వర్షాలు లేనందున రెండో పంటను వదులుకుంటున్నం.

*- రాచూరి సాయికుమార్, రైతు, వీపనగండ్ల*

### రైతులు అర్థం చేసుకోవాలి..



జిల్లాలో భూగర్భజల మట్టాలు తగ్గుతున్నాయి. ఈసారి వర్షాలు అనుకున్నంత లేవు. నవంబర్ నెల నుంచే భూమిలో జలాలు తగ్గుతున్నాయి. ఇంకా మూడు నెలల వరకు అధికంగా తగ్గే అవకాశం ఉంది. రైతులు ఎవరైనా యాసంగిలో వరి వేసేవాళ్లు ఎట్టిపరిస్థితుల్లో నూ వేయవద్దు. కనీసం ఆరుతడి ద్వారా ఏదైన పంటను సాగు చేసుకోవడం మంచిది. చివరకు నీళ్లు అందక, సరిపడక నష్టపోయేదానికంటే ముందే మేల్కొనండి. ప్రాజెక్టుల్లోనూ నీటి పరిస్థితులు ఆశాజనకంగా లేనందునా రైతులు గమనించి అర్థం చేసుకోవాలి.

*- మోహన్, భూగర్భ జల శాఖ జిల్లా అధికారి, వనపర్తి*

### మరింత లోతుకి బోరు పైపులు..

బోరు బావుల్లో అప్పుడే నీరు తగ్గుతుండడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. నవంబర్ నెలలోనే బోర్లు తక్కువ నీటిని పోయడంతో ప్రత్యామ్నాయాలను ఏర్పాటు చేసుకున్నారు. ఉన్న బోర్లల్లో లోతుగా మరికొన్ని పైపులు దింపి నీటిని తోడుకొనే ప్రయత్నాలు చేస్తున్నారు. కాల్వ నీళ్లు.. చెరువుల్లో నీరున్న ప్రాంతాల్లో కొంత మేలుగా ఉన్నప్పటికీ నీటి ఎద్దడి ఉన్న ప్రాంతాల్లో వేగంగా బోర్లు తగ్గుతున్నాయి. జిల్లాలోని కొన్ని ప్రాంతాల్లో కాల్వ నీటితో చెరువులు నిండి ఉన్నాయి. ఆ ప్రాంతాల్లో ఉన్న బోర్లు కొంత మెరుగ్గానే ఉన్నాయి. నవంబర్ నెలలోనే బోర్లు తగ్గుమొఖం పడుతుంటే.. ఇంకా జనవరి, ఫిబ్రవరి, మార్చి నెలల వరకు భూగర్భజలాల పరిస్థితి ఎలా ఉంటుందోనని రైతులు ఆందోళన చెందుతున్నారు. కాగా కాల్వల నీటి వసతి లేని ప్రాంతాల్లో మరింత వేగంగా బోర్లలో నీరు తగ్గిపోతోంది.

### దళితబంధును కొనసాగించాలి



కేసీఆర్ ప్రభుత్వం దళితులను అన్ని విధాలా ఆదుకునేందుకు దళితబంధు పథకానికి శ్రీకారం చుట్టింది. ఆ పథకాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తే దళితులు అభివృద్ధి చెందే అవకాశం ఉంది. ప్రభుత్వం దళితులపై పెద్ద మనస్సు చేసుకొని పథకాన్ని వందశాతం అమలు చేసేలా చర్యలు తీసుకోవాలి. లేకుంటే ఆందోళనలు ఉధృతం చేస్తాం.

*- నరేశ్, లబ్ధిదారుడు*

### పథకాన్ని రద్దు చేయొద్దు



దళితబంధు తక్కువ సమయంలో ఎక్కువ మంది దళితుల జీవితాల్లో వెలుగులు నింపిన పథకం. దీని సాయంతో మేము మంచిగా బతుకుతాం.. ఈ పథకాన్ని యథావిధిగా కొనసాగించడానికి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రయత్నించాలి. కానీ రద్దు చేస్తామని అంటుండడం మంచి పద్ధతి కాదు. రద్దు చేస్తే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుంది.

*- నర్సింహ, లబ్ధిదారుడు*

### ఎమ్మెల్యే పీఛేముడ్..

కలెక్టరేట్‌లో ప్రపంచ వికలాంగుల దినోత్సవాన్ని సంబంధిత శాఖాధికారులు అట్టహాసంగా నిర్వహించి ఎమ్మెల్యేలను ఆహ్వానించారు. అయితే దళితులు నిరసన చేస్తున్న విషయం తెలియక కార్యక్రమానికి హాజరయ్యేందుకు మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి వచ్చారు. విషయం తెలుసుకున్న పోలీసులు కలెక్టరేట్ ఎదుట దళితులు నిరసన కార్యక్రమం చేపట్టారని తెలిపారు. దీంతో ఎమ్మెల్యే ఎక్కడ అడ్డుకుంటారోననే భయంతో వెనుదిరిగారు. కలెక్టరేట్‌కు రాకుండానే తిరిగి వెళ్లిపోవడంతో అధికారులు కార్యక్రమాన్ని కొంతసేపు వాయిదా వేసుకున్నారు. కాగా ఎమ్మెల్యే వస్తున్నాడని తెలిసిన దళిత బంధు లబ్ధిదారులు ఘెరావ్ చేయడానికి సమయాత్తమయ్యారు. అంతలోనే ఎమ్మెల్యే వెళ్లిపోయాడని సమాచారం రావడంతో సిగ్గు సిగ్గు అంటూ నినాదాలు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం కూడా దళితబంధు పథకాన్ని కొనసాగించాలని, లేకుంటే ఆందోళనలు తీవ్రతరం చేస్తామని దళితులు హెచ్చరించారు.



మహబూబ్‌నగర్ కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న దళితబంధు లబ్ధిదారులు

# దళితబంధు ఇవ్వాల్సిందే..

- స్కీంను గ్రౌండింగ్ చేసి ఆదుకోవాలి
- సాయం అందే వరకు మా పోరాటం ఆగదు
- మాయమాటలతో మా కడుపు కొట్టొద్దు
- పాలమూరు కలెక్టరేట్ వద్ద లబ్ధిదారుల బైఠాయింపు
- భారీగా మోహరించిన పోలీసులు
- ఐడీవోసీకి రాకుండా వెనుదిరిగిన ఎమ్మెల్యే
- ప్రభుత్వ వైఖరిపై తీవ్ర ఆక్షేపణలు
- కేసీఆర్ ప్రభుత్వంలో దళితుల జీవితాల్లో వెలుగులు

మహబూబ్‌నగర్, జనవరి 11 : దళితబంధు పథకం అమలు చేయాలని డిమాండ్ చేస్తూ గురువారం మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన దళితులు పెద్ద ఎత్తున కలెక్టరేట్‌ను ముట్టడించారు. మహబూబ్‌నగర్, దేవరకద్ర, జడ్చర్ల నియోజకవర్గాలకు చెందిన లబ్ధిదారులు కలెక్టరేట్ ఎదుట భారీ నిరసన కార్యక్రమం చేపట్టారు. దళితులు ఆర్థికంగా ఎదిగే ఈ పథకాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం రద్దు చేయాలని ఆలోచన చేయడంపై ఆందోళన వ్యక్తం చేశారు. కేసీఆర్ ప్రభుత్వం దళితులను ఉద్దేశించి ప్రవేశపెట్టిన పథకానికి ఉన్న అడ్డంకులన్నీ తొలగించి లబ్ధిదారులకు న్యాయం చేయాలని కోరారు. దీంతో కలెక్టరేట్ వద్ద ఉద్రిక్తత నెలకొంది. కలెక్టర్‌ను కలిసి వస్తామని లబ్ధిదారులు ప్రయత్నించగా పోలీసులు మెయిన్‌గేట్ వద్ద అడ్డుకున్నారు. తమను అడ్డుకోవడంతో పోలీసులతో వాగ్వాదానికి దిగారు. కాగా అంతలోనే సమీకృత కలెక్టరేట్‌లో ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా అధికార యంత్రాంగం చేపట్టిన కార్యక్రమానికి వచ్చిన ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి ఆందోళనను చూసి కార్యక్రమంలో పాల్గొనకుండానే వెనుదిరిగారు. తమకు న్యాయం జరిగే వరకు పోరాటం చేస్తామని హెచ్చరించారు. ఈ పథకానికి అర్హులుగా ఎంపిక చేస్తు ప్రభుత్వం జారీ చేసిన ప్రొసీడింగ్‌లను మీడియాకు చూయించారు. జిల్లా వ్యాప్తంగా 2,982 మందికి గత ఏడాది నవంబర్‌లో దళిత బంధు పథకం కింద ఎంపిక చేస్తూ ఉత్తర్వులు ఇచ్చారు. వీరందరికీ సంబంధిత బ్యాంకుల్లో అకౌంట్లను కూడా ఓపెన్ చేయించారు. కాగా ఎన్నికల కోడ్ రావడంతో పథకం లబ్ధిదారులకు పడాల్సిన నగదు సాయం వాయిదా పడింది. కాగా ప్రభుత్వం మారడం.. 40రోజులు దాటుతున్నా ఇంకా ఈ పథకంపై కొత్తగా వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకోకపోవడంతో ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దళిత బంధును రద్దు చేయకుండా అమలు చేయాలని డిమాండ్ చేస్తూ భారీ ఎత్తున నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. కాగా ఆందోళన చేస్తున్న లబ్ధిదారులను నచ్చజెప్పి కొంతమందిని వినతిపత్రం అందించడానికి కలెక్టరేట్‌లోకి అనుమతించారు. అనంతరం దళితబంధు లబ్ధిదారులకు న్యాయం చేయాలంటూ అడిషనల్ కలెక్టర్ మోహన్‌రావుకు వినతిపత్రం అందించారు. ఉదయం 11 గంటలకు ప్రారంభం అయిన ఆందోళన మధ్యాహ్నం ఒంటిగంటకు ముగిసింది. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఆంజనేయులు, దేవరకద్ర మార్కెట్ మాజీ చైర్మన్ ఆంజనేయులు, పెద్ద జంబులయ్య, నవాబ్‌పేట మాజీ ఎంపీపీ శ్రీనివాస్, నర్సింహులు, రాజమల్లు, బుచ్చన్న, రాములు, రాంచంద్రయ్య, బాలయ్య ఉన్నారు.



నినదిస్తున్న లబ్ధిదారులు